క్లుప్తంగా

ఘనంగా నూకాంబిక నెల పండగ



తిమ్మరాజుపేటలో నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు

మునగపాక: నూకాంబిక అమ్మవారి నెల పండగ ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా జరిగింది. తిమ్మరాజుపేట, మునగపాక, పల్లవు ఆనందపురం, గణపర్తి తదితర గ్రామాల్లో భక్తులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. తిమ్మరాజుపేటలో ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. పలువురు మహిళలు ఘటాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ జాతీయ రహదారి నుంచి మునగపాక సబ్ స్టేషన్ వరకు గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జగదీష్ తెలిపారు. 33 కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా చెట్ల తొలగింపు చేస్తామన్నారు. ఉమ్మలాడ, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట తదితర గ్రామాల్లో విద్యుత్‌ను నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బ్లీచింగ్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో బ్లీచింగ్ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో దోమల బెడద లేకుండా బ్లీచింగ్ జల్లిస్తున్నామన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ



గణపర్తిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

మునగపాక: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని గణపర్తిలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిలో అసువులు బాసిన వారందరికీ నివాళులర్పించారు. జన సైనికుడు కాళ్ల చంద్రమోహన్ ఆధ్వర్యంలో గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడులు సరికావని పేర్కొన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. తరిమి కొడదాం ఉగ్రవాదాన్ని, భోలో భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. కార్యక్రమంలో కర్రి లక్ష్మీనారాయణ, ఆడారి గోపి, గిన్నె ప్రసాద్, మళ్ల జగదీష్, కాండ్రేగుల వెంకటరావు, దిలీప్, మారిశెట్టి రామలక్ష్మి, రాంజీ, తలుపులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో డ్రోన్ నిఘా



ఎస్.రాయవరంలో డ్రోన్ కెమెరా చిత్రం

ఎస్.రాయవరం: మండలంలో నిత్యం ఏదో ఒక ప్రదేశంలో డ్రోన్ నిఘా ఉంటుందని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఎస్. రాయవరంలో జాతరను పురస్కరించుకుని డ్రోన్ నిఘా ఉంచామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు కట్టడికి డ్రోన్ నిఘా ద్వారా గుర్తించి నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

యలమంచిలి రూరల్: మండలంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025–26 సంవత్సరానికి పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని ఎంఈవో–1 వై మీనాక్షి తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూలు కులాలు 10 శాతం, షెడ్యూలు తెగలు 4 శాతం, బలహీన వర్గాలకు(బీసీ, మైనార్టీ, ఓసీ) 6 శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో గానీ, సచివాలయం, ఎంఈవో కార్యాలయంలో వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పల్లె గొంతెండుతోంది

పల్లెల గొంతెండుతోంది.. గుక్కెడు మంచినీళ్లు దొరకక నాలుక తడారిపోతోందని జనం గగ్గోలు పెడుతున్నారు. ఏ ఇంటి తలుపు తట్టినా దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాగునీరు అందించండి మహాప్రభో అంటూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లెక్కుతున్నారు. ఇటువంటి దయనీయ పరిస్థితి హోం మంత్రి అనిత ఇలాకాలో నెలకొంది. దశాబ్దాలుగా వాటర్ గ్రిడ్ పనులు పూర్తి కాకపోవడంతో ఇక్కడ తీవ్ర నీటి ఎద్దడి ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- శిథిలమైన పైలట్ ప్రాజెక్టు పైపులైన్లు
- గ్రామాల్లో దాహం కేకలు
- ఖాళీ బిందెలతో మహిళల నిరసనలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని కూటమి పాలకులు



ఉపమాకలో నిరుపయోగంగా ఉన్న సంప్



నల్లమట్టిపాలెంలో పైపులైన్ల నుంచి నీరు రావడం లేదంటూ నిరసన తెలుపుతున్న మహిళలు

నక్కపల్లి: గ్రామాల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. రక్షితనీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్నారు. వేసవిలో గొంతెండుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. దాదాపు నెల రోజుల నుంచి తాగునీటి సరఫరా సరిగ్గా జరగకపోవడంతో తమ్మయ్యపేట, నల్లమట్టిపాలెం తదితర గ్రామాల్లో మహిళలు ఖాళీ బిందెలు చేతపట్టి ఆందోళనకు దిగుతున్నారు.

మండలంలో నక్కపల్లి, ఉపమాక, చందనాడ, బుచ్చిరాజుపేట, అమలాపురం, పాటిమీద, మూలపర, చందనాడ, తమ్మయ్యపేట, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం, ఎన్. నర్సాపురం తదితర గ్రామాలకు ఇందేశమ్మవాక వద్ద వరాహ నదిలో ఏర్పాటు చేసిన(పైలట్ ప్రాజెక్టు) రక్షితనీటి పథకం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌లు ఏర్పాటు చేసి అక్కడ నుంచి గ్రామాల్లో వీధులకు పైపుల ద్వారా తాగునీటిని విడుదల చేస్తున్నారు. సుమారు 25 కిలోమీటర్ల దూరం నుంచి ఈ గ్రామాలకు పైపుల ద్వారా తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. దాదాపు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ పైపులైను పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా తాగునీరు పూర్తిగా సరఫరా కావడం లేదు. పలు చోట్ల మధ్యలో పైపులు ధ్వంసం కావడం, లీకులు ఏర్పడటం కారణంగా ఈ గ్రామాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు.

వైఎస్సార్ హయాంలో నిధులు మంజూరు

ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 2005లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉద్దండపురం వద్ద వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసేందుకు రూ.36 కోట్లు మంజూరు చేశారు. కోటనందూరు సమీపంలో ఏలేరు కాలువ నుంచి పైపుల ద్వారా నీటిని తీసుకువచ్చి ఉద్దండపురం వద్ద స్టోరేజీ ట్యాంకుల్లో నిల్వ చేసి శుద్ధి చేసి నియోజకవర్గంలో సుమారు 97 గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలన్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అప్పట్లోనే పైపులైను పనులు పూర్తయ్యాయి. ఏలేరు నీటిని పాయకరావుపేట నియోజకవర్గంలో తాగునీటి అవసరాల కోసం ఉపయోగించేందుకు అనుమతులు కూడా వైఎస్సార్ హయాంలోనే మంజూరయ్యాయి. స్టోరేజీ ట్యాంకులు నిర్మించారు. శుద్ధి చేసే సామగ్రి కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ శుద్ధి చేసిన నీటిని గ్రామాల్లోకి తరలించేందుకు పైపులైను పనులు మాత్రం పూర్తి కాలేదు. ఉద్దండపురం, గొడిచర్ల తదితర దగ్గరగా ఉన్న గ్రామాలకు మాత్రమే వాటర్ గ్రిడ్ ద్వారా ప్రస్తుతం నీటిని సరఫరా చేస్తున్నారు.



తమ్మయ్యపేటలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

పూర్తి కాని వాటర్ గ్రిడ్

తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం మరో రూ.50 కోట్లు మంజూరు చేయడంతో ఇక్కడ కొన్ని స్టోరేజీ ట్యాంకులు, ఉద్దండపురం, గొడిచర్ల, వేంపాడు గ్రామాల వరకు పైపులైన్లు మాత్రం ఏర్పాటు చేశారు. వాటర్ గ్రిడ్ పనులు మాత్రం పూర్తి చేయలేదు. ఇది ఇంకా అసంపూర్తిగానే ఉండిపోయింది. వాటర్‌గ్రిడ్ పూర్తి కాకపోవడం, ఇందేశమ్మవాకలో ఏర్పాటు చేసిన పైలట్ ప్రాజెక్టు నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో చందనాడ, అమలాపురం, వేంపాడు చుట్టు పక్కల గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. పది రోజులకొకసారి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతోందంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు గ్రామాల్లో చేతిబోర్ల నుంచి నీటిని తెచ్చుకుని తాగాల్సి వస్తోందని, ఈ నీరు ఉప్పుగా ఉంటోందని ఆయా గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో రక్షితనీటి పథకాలకు అనుసంధానం చేసిన పైలట్ ప్రాజెక్టు పైపులైను శిథిలం కావడంతో ఈ ఇబ్బందులు నెలకొన్నాయని ఆయా గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. కనీసం కూటమి పాలకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదని వాపోతున్నారు.

కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిక

ఇటీవల తమ్మయ్యపేట, నల్లమట్టిపాలెం గ్రామాల వారు ఖాళీ బిందెలు చేతపట్టి పైపులైన్ల వద్ద నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, రాజేష్ తదితరులు వారికి సంఘీభావం తెలిపారు. గత నెలరోజుల నుంచి మండలంలో 15 గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. తక్షణమే ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

వారానికి ఒక రోజు నీరు రావడం లేదు



గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వారానికి ఒకరోజు కూడా నీరు రావడం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం.పైలట్ ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు సరిగ్గా రావడం లేదు. ఊర్లో ఉన్న బోర్లు, బావుల నుంచి నీటి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఉప్పుగా ఉండటం వల్ల తాగడానికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలి.

– సూరాకాసుల రామలక్ష్మి, మూలపర

తమ్మయ్యపేటలో తీవ్రంగా నీటి ఎద్దడి



చందనాడ శివారు తమ్మయ్యపేటలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పదిరోజుల కొకసారి తాగునీరు రావడం లేదు. పైలట్ ప్రాజెక్టు పైపులైను పూర్తిగా దెబ్బతింది. పలుమార్లు మరమ్మతులు చేసినా ఉపయోగం లేదు. కొత్తలైను వేయడం లేదా ఉద్దండపురం వద్ద వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేస్తేనే ఈ సమస్య పరిష్కారమవుతుంది. ముఖ్యంగా శివారు గ్రామాల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– గంటా తిరుపతిరావు, చందనాడ

ఘనంగా గంధం అమావాస్య పండగ

- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు
- దేవవరంలో బోనాలు సమర్పణ



దేవవరంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: నూకాలమ్మ అమ్మవారి నెల పండగ గంధం అమావాస్య పండగను పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే నూకాలమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవవరం, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, అమలాపురం, వేంపాడు, నెల్లిపూడి, ఉపమాక, పాటిమీద తదితర గ్రామాల్లో నూకాలమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి కానుకలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవవరంలో వందలాది మంది మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామంలో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రదక్షిణ చేసి నూకాలమ్మకు బోనాలు, సారె సమర్పించారు. అత్యంత వేడుకగా జరిగిన ఈ బోనాల ఊరేగింపులో గ్రామస్తులు వందలాది మంది పాల్గొన్నారు. ఆలయం వద్ద యువత ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. ఉద్దండపురంలో గంధ అమావాస్య పండగను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అమ్మవారి దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయాల వద్ద విద్యుద్దీపాలంకరణ, మజ్జిగ సరఫరా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గంధ అమావాస్య పండగను పురస్కరించుకుని వివిధ గ్రామాల్లో ఆలయాలను కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మణిరాజు, పాపారావు, తాతబాబు, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు, సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, సురేష్ రాజు, ఎంపీటీసీలు తిరుపతిరావు, గొర్ల గోవిందు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు తదితరులు దర్శించుకున్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

శాఖా గ్రంథాలయాల్లో జూన్ 6వ తేదీ వరకు నిర్వహణ



చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో ప్రచారం చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: వేసవి సెలవుల అనంతరం విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు శాఖా గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రత్యేక శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, స్పోకెన ఇంగ్లిష్, వ్యాస రచన, పద్య పఠనం, చిత్రలేఖనం వివిధ వర్తమాన అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సెలవుల్లో విద్యార్థులు ఎండలో ఆటల పేరుతో తిరుగుతూ ఆరోగ్యాన్ని పాడు చేసుకోకుండా ఆటపాటలతో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయాధికారి కే జనార్దన్ తెలిపారు. విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను ఈ సమ్మర్ కాంపులకు వచ్చే విద్యార్థుల కోసం గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. పుస్తకాల ద్వారా జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన విషయాలు తెలియజేస్తారు. చిత్రలేఖనం, చిన్న చిన్న పదాలను ఉపయోగించి ఇంగ్లిషు నేర్పిస్తారు. మాట్లాడటం, చదవడం, రాయవడం వంటివి నేర్పించడం ద్వారా ఇంగ్లిషుపై భయం పోగొట్టి ఆసక్తి పెంచుతారు. విద్యార్థులకు, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్ వంటి పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల వారిలో పోటీతత్వం పెరుగుతుందని గ్రంథపాలకుడు తెలిపారు. చినదొడ్డిగల్లు, నక్కపల్లి, ఉపమాక, పాయకరావుపేట, ఎస్‌రాయవరం, కొరుప్రోలు తదితర గ్రంథాలయాలతోపాటు, అనుబంధ బుక్ డిపో సెంటర్లలో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. స్థానికంగా పాఠశాలల్లో పనిచేసే భాషా ఉపాధ్యాయులతో పాటు, సబ్జెక్ట్ టీచర్లను తీసుకువచ్చి విద్యార్థులకు అవసరమైన తర్ఫీదు నివ్వడం జరుగుతుందన్నారు.

అంబరాన్నంటిన సంబరం





ఎస్.రాయవరం జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: గ్రామాల్లో ఉత్సవాలు ఐక్యతను పెంచుతాయని వైఎస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. ఎస్.రాయవరంలో గంధం అమావాస్య జాతరను పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యకర్తలు, నాయకులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, స్థానిక నాయకులు కొమ్ము జగదీష్, కుర్రా కాశి పాల్గొన్నారు.

కనుల పండువగా సంబరం..

గంధం అమావాస్య జాతరను పురస్కరించుకుని రాయవరంలో అమ్మవారి గరగల ఊరేగింపులో నేల డ్యాన్సు, కోలాటం, శక్తి వేషాలు అలరించాయి. కొరుప్రోలులో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వీరికి మజ్జిగ, అల్పాహారాలు అందించారు. ఎస్.రాయవరం, కొరుప్రోలు, పేటసూధిపురం గ్రామాల్లో ఆలయాలు మధ్యాహ్నం వరకు భక్తులతో కిక్కిరిశాయి.

మూసివేసిన రోడ్డును తెరిపించాలి



ఆందోళన చేస్తున్న ఉమ్మలాడ గ్రామస్తులు

మునగపాక: గతంలో మూసివేసిన రహదారిని తిరిగి తెరిపించాలని కోరుతూ ఆదివారం ఉమ్మలాడ గ్రామస్తులు హైవేపై ఆందోళనకు దిగారు. దళిత బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లంబా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో హైవే అధికారులు రహదారిని మూసివేయడంతో అటు రైతులు ఇటు చర్చికి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారి సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకువెళతామన్నారు.

మెరైన్ పోలీసుల తనిఖీ

అచ్యుతాపురం రూరల్: పూడిమడక తీరంలో ఆదివారం మెరైన్ పోలీసులు మత్స్యకారులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు తీరంలో తారసపడితే వెంటనే సమాచారం అందించాలని మెరైన్ సీఐ సింహాద్రినాయుడు తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, కొత్త బోట్లు, కలర్ కోడ్ అనుమానంగా ఉన్నట్లయితే వెంటనే మెరైన్ పోలీసులకు లేదా 1093 టోల్ ఫ్రీ నెంబరుకు సంప్రదించి సమాచారం అందివ్వాలని కోరారు. ప్రతి ఒక్కరూ దేశ భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తీరంలో మెరైన్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది బోట్లు తనిఖీ నిర్వహించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బంగారి

ఎస్.రాయవరం: క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేస్తున్నట్టు మాజీ సర్పంచ్ చోడిపల్లి బంగారి తెలిపారు. కొత్తరేవుపోలవరంలో బంగారమ్మతల్లి జాతరను పురస్కరించుకుని మండల స్థాయి క్రికెట్ పోటీలకు రూ.1.50 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. ఇక్కడ మైదానంలో నాలుగు రోజులు పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్ యూనియన్ చైర్మన్ ఎస్ సీతారామరాజు, యువకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న యల్లపు అప్పారావు కుటుంబీకులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని దిమిలి రోడ్డు పాతవీధి శతకంపట్టు వద్ద ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. స్థానిక యల్లపు అప్పారావు కుమారులు యల్లపు శేషుబాబు బ్రదర్స్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా పాదచారులు, వాహదారుల దాహార్తి తీర్చడానికి దీనిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పందూరి తాతబాబు, ఆడారి శివ, యల్లపు రాజు, యల్లపు చంద్రబాబు, యల్లపు ప్రసాదు, కిరాణా షాపు వీరబాబు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లిస్తే భూమిలిచ్చేది లేదు

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రభుత్వం పరిహారంగా టీడీఆర్ బాండ్లే ఇవ్వాలనుకుంటే ఎవ్వరూ భూములిచ్చేది లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తేల్చిచెప్పారు. ఆదివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో రహదారి విస్తరణ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి విస్తరణ ఆవశ్యమని, అయితే పరిహారం మాత్రం నేరుగా నగదు రూపంలో అకౌంట్‌లో జమ చేయాల్సిందేనన్నారు. అంతేకాని టీడీఆర్ బాండ్లు ఇస్తే తీసుకునేది లేదన్నారు. కొంతమంది అధికారులు గుట్టుచప్పుడు కాకుండా అమాయక నిర్వాసితులతో సంతకాలు చేసేందుకు యత్నిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. టీడీఆర్ బాండ్ల వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. గతంలో అధికారులు ఇచ్చిన మాట మేరకు ప్రతీ బాధితునికి పరిహారాన్ని అకౌంట్‌లో జమ చేయాల్సిందేనన్నారు. అంతేకాని విభజించి పాలించే విధంగా అధికారులు ప్రయత్నిస్తే తిప్పికొట్టాలన్నారు. మరో వారం రోజుల్లోగా రహదారి విస్తరణకు సంబంధించి ప్రణాళిక రూపొందించేందుకు సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో బొద్దపు శ్రీరామమూర్తి, విల్లూరి జగన్నాథరావు, పొలమరశెట్టి అప్పలనాయుడు, చంద్రకళ, మళ్ల సూరప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సూరెడ్డి పాకల వద్ద చేతిబోరు ఏర్పాటు



చేతిబోరు పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు

కోటవురట్ల: రైతుల మకాములలో మంచినీటి సమస్య లేకుండా చేతిబోర్లు వేయిస్తున్నామని సర్పంచ్ డి.సత్యవతి, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. పాములవాక గ్రామంలోని సూరెడ్డి వారి వ్యవసాయ పాకల వద్ద ఆదివారం చేతిబోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా పంచాయతీ నిధులతో దఫదఫాలుగా మకాంలలో చేతిబోర్లు వేయిస్తున్నామని తెలిపారు. తాజాగా రైతులు సూరెడ్డి నూకరాజు, సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి, చిరంజీవి, బాబులు, రమణకు చెందిన పాకల వద్ద బోరు తీయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మేడే జయప్రదం చేయండి



బుక్‌లెట్ విడుదల చేస్తున్న కార్మిక యూనియన్ నాయకులు

అచ్యుతాపురం రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు కోరారు. మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు అధ్యక్షతన ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ కార్మికులందరూ పతాకావిష్కరణలో పాల్గొని సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జరిగే మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అనంతరం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని బుక్‌లెట్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజాన సత్తిబాబు, ఎస్ఈజెడ్ కార్మికులు గొర్లె సత్తిబాబు, రాము, అప్పలరాజు, ఆటో యూనియన్ నాయకులు తట్టా రాజు, నాయుడు, మోటార్ యూనియన్ నాయకులు రామకృష్ణ, గణేష్, చిల్లర వర్తకుల సంఘం నాయకులు చిన్నారావు, కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాయకరావుపేట డివిజన్: 9951602901

Office mail : sakshiadvtvsp@gmail.com